రక్తదాతలే ప్రాణదాతలు

ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నేటి రక్తదాతలే..రేపటి ప్రాణదాతలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఐఐటీ అనుబంధ నేషనల్ సర్వీస్ స్కీమ్, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించచారు. ఈ శిబిరంలో ఐఐటీ విద్యార్థులు, పెద్ద ఎత్తున అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 100 యూనిట్ల రక్తాన్ని ఈ శిబిరం సందర్భంగా సేకరించింది. రక్తదాన ఆవశ్యకతను సత్యనారాయణ వివరించారు. స్వచ్ఛందంగా మనం చేస్తున్న రక్తదానం భవిష్యత్తులో ఆపదలో ఉన్న ఎంతోమంది అమాయకుల ప్రాణాలను నిలబెడుతుందని వివరించారు.

జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారు : డిప్యూటీ సీఎం



ప్రజాశక్తి - కార్వేటినగరం

పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన జగనన్న మరో అడుగు ముందుకేసి పేదల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, పేదలకు ఇంటి వద్దకే వైద్యం అందించడంతో చరిత్రలో నిలిచిపోయారని డిప్యూటీ సిఎం నారాయణస్వామి కొనియాడారు. శనివారం మండలంలోని ఆర్కేవిబి పేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి డాక్టర్ రోగులకు దేవునితో సమానమని అభివర్ణించారు. అనంతరం కంటి చూపు తగ్గిన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలోని తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, కార్వేటినగరం కత్తెరపల్లిలోని పనిచేస్తున్న వైద్యుధికారులు ఈ క్యాంపుకు రావడం అభినందనీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మోడల్ అధికారి డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ పేదలకు వరమన్నారు. ఆర్‌కెవిబిపేటలో ఏర్పాటు చేసిన శిబిరానికి 700 మంది రోగులు హాజరయ్యారు. ఎవరికైనా శస్త్ర చికిత్స అవసరం అయితే ఏరియా ఆస్పత్రికి పంపుతామన్నారు. ఉచితంగానే పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ బీపీ, సుగర్ వ్యాధులు కంట్రోల్‌లు పెట్టుకోవాలని, అపుడే మందులు పనిచేస్తాయన్నారు. స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ పదేళ్లకు ముందే కార్వేటినగరం మండలంలో ప్రతి ఇంటిలో పూర్తి వివరాలను సేకరించి ఏ వయస్సు గలవారు ఎందరు ఉన్నారనే సంఖ్యతో సహా పుస్తకాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దివ్యదుష్యంత్, ఎంపిపి లత బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ జడ్‌పిటిసి దేవకి లోకనాథరెడ్డి, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ పాల్గొన్నారు.

అందరూ సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని 39, 40, 41, 44, 45, 48, 49, 50 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సంతపేట ఉన్నత మున్సిపల్ హై స్కూల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంబించారు. ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఉచితంగా మంచి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాపుల్లో నిపుణులైన వైద్య అధికారుల ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నగర కమిషనర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు స్థానికంగా ఉచితం వైద్యం అందిస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండీ విశేష స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జ్ఞానజగదీష్, వైకాపా నాయకులు నారాయణ, డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆశాలపై పని ఒత్తిడి వద్దు : సిఐటియు

ఆశాల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి - పలమనేరు

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో ఆకస్మికంగా మృతిచెందిన కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆశా కార్మికులపై పని భారం తగ్గించాలని శనివారం పలమనేరు జూనియర్ కళాశాల వద్ద, మండిపేట కోటూరులలో ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఆశావర్కర్లకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారన్నారు. ఈ కారణంగానే చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో జానకి అనే ఆశా వర్కర్ నాలుగు రోజుల క్రితం మృతిచెందిందన్నారు. ఇపుడు గుంటూరు జిల్లా తాడేపల్లిలో కృపమ్మ చనిపోయిందన్నారు. ఇవన్నీ ముమ్మాటికే ప్రభుత్వ హత్యలేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్లే ఈ చావులన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని ఆశా వర్కర్లు ఆందోళనలు చేస్తుంటే నిర్బంధాలతో ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించి, వేధింపులు ఆపి, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గిరిధర్ గుప్తా, సుబ్రహ్మణ్యం, నాయకులు రాజా, జయంతి, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు సావిత్రి, భాగ్యలక్ష్మి లతోపాటు ఆశా కార్మికులు పాల్గొన్నారు

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి చిత్తూరు నగర పరిధిలోని మధు స్కాన్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. గర్భిణీ స్త్రీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ చేయరాదని, అలా చేసినట్లయితే పిసిపిఎన్‌డిటి ప్రకారం శిక్షార్హులన్నారు. అలా పట్టుబడినట్లైతే సదరు డాక్టర్‌కి, సహాయం చేసిన నర్స్‌కి ,గర్భిణీ స్త్రీకి, వెంట వచ్చిన వారికి నలుగురికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష 10వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ప్రస్తుతం వెయ్యి మంది మగవారికి 933 మంది ఆడవారు మాత్రమే ఉన్నారు కాబట్టి ఈనిష్పత్తిని సరి చేయవలసిన బాధ్యత ప్రజలందరికీ ఉందన్నారు.

పస్తులతో విజయ డెయిరీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పాత బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట విజయ సహకార డెయిరీ కార్మికులు మూడో శనివారం (గోవింధుల) పండుగ రోజున పస్తులతో మోకాళ్లపై నిలబడి ప్రభుత్వ తీరును నిరశిస్తూ రిలే దీక్షలో పాల్గొన్నారు. 15 రోజులుగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడక పోవడం దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బకాయి వేతనాలు చెల్లించేంత వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తిరుపతిలోనే పవన్ పోటీ



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'తిరుపతి నుంచి పోటీ చేయి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. తిరుపతి ప్రజలు అప్పట్లో ఎన్టీఆర్‌ను, తరువాత కొణిదెల చిరంజీవిని ఆదరించారని, తొలి ప్రాధాన్యత తిరుపతికే ఇచ్చి కేంద్రీకరించాలని చెప్పినట్లు తెలుస్తోంది. జనసేన, టిడిపి కలయిక నేపథ్యంలో తిరుపతి వరకూ గ్రీన్‌సిగ్నల్ జనసేనకు ఇచ్చేసినట్లే.

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జనసేన, టిడిపి పొత్తులు, సీట్లు గురించి చర్చ నడుస్తోంది. మదనపల్లి, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో అసెంబ్లీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం. తిరుపతి లోక్‌సభనూ జనసేన ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో ప్రస్తుత ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర నాయకులు వూకా విజయకుమార్, టిటిడి మాజీ బోర్డు మెంబర్ ఒవి రమణ పోటీ పడుతున్నారు. వారితో పాటు పొత్తులో భాగంగా జనసేన నుంచి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ ఆశిస్తున్నారు. అధికార పార్టీని బలంగా ఎదుర్కోవాలంటే తిరుపతి లాంటి ప్రాధాన్యత గల నియోజకవర్గంలో పవన్‌కల్యాణే సరైన అభ్యర్థిగా చంద్రబాబు భావించినట్లు తెలుస్తోంది. బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో సాలిడ్‌గా పవన్‌కల్యాణ్‌కు ఓట్లు పడతాయని, విద్యాకేంద్రంగా ఉన్న తిరుపతిలో యువత ఓట్లు జనసేనకు మళ్లించేలా వ్యూహంలో ఉన్నారు. ఏదిఏమైనప్పటికీ బాబు వేసిన 'స్కెచ్' చూస్తుంటే పవన్‌కల్యాణ్ తిరుపతి నుంచే పోటీ చేస్తారనుకోవచ్చు.

టిడిపి క్యాండిల్ నిరసన

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు శనివారం చిత్తూరు జిల్లా పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోని లైట్లు ఆఫ్ చేసి పార్టీ ఆఫీసు గేటు ముందు. కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు. కటారి హేమలత. మోహన్ రాజ్. సూబ్రి. వేంక టేష్ యాదవ్. రాజశేఖర. దుర్గచౌదరి. గోపి. బాబూ రెడ్డి. కిశోర్. గోపి, సుధాకర్. రమేష్, రాధాకష్ణ, కంద స్వామి, మురళి పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ తన నివాసంలో కుటుంబంతో క్యాండిల్ కాంతితో నిరసన వ్యక్తం చేశారు, జగన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. ప్రజలు చంద్రబాబుకు మద్దతుగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

10న సుస్థిరాభివృద్ధిపై వర్కుషాపు : జేసీ

చిత్తూరుఅర్బన్: సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధన పై సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని, డివిజన్ స్థాయిలో ఈనెల 10న వర్క్ షాప్‌ల నిర్వహణకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఈ నెల 10న డివిజన్ స్థాయి లో నిర్వహించనున్న వర్క్ షాప్ ల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిపిఓ లక్ష్మి ని జెసి ఆదేశించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కుప్పం

కుప్పం మండలం జడ్పీహెచ్ఎస్ చందం పాఠశాల నందు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 విభాగం లో బాలబాలికల ఎంపిక జరిగింది. 9వ తరగతి చదువుతున్న లిఖిత్, పదవ తరగతి చదువుతున్న పూజ, అడవి బూదుగురు జడ్.పి.హెచ్.ఎస్ లో పదో తరగతి చదువుతున్న ఎన్ వెన్నెల, జడ్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గరికిచినేపల్లి పదో తరగతి చదువుతున్న వినోద్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి సదుమూరు ధనుష్ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ దర్శకులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సహచర సిబ్బంది అభినందించారు.

షూటింగ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కుప్పం: కుప్పం పట్టణం లయన్స్ క్లబ్ ఆఫీస్ లో చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ నూతన కార్యవర్గం ఏకగ్రీవమయ్యిందని అసోసియేషన్ స్టేట్ అబ్జర్వర్ నరేష్‌బాబు తెలిపారు. ఛైర్మన్‌గా మహేష్, అధ్యక్షులుగా కల్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్, కార్యదర్శిగా సంగనపల్లే పీడీ వేణుగోపాల్, కోశాదికారిగా సబిత, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకట రమణారెడ్డి, లోకనాధం, జాయింట్ సెక్రటరీగా జబీర్, స్వాతి, ఇసి మెంబర్లుగా వేణు, సురేష్, చెన్నకేశవ, మాండవ్య ఎన్నికయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా వివేక్ ఉంటారు.

తిరుపతి గాంధీ విగ్రహం ఎదుట యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు, దళిత, ప్రజాసంఘాల నిరసన

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జర్నలిస్టులను అరెస్టు చేసి, వారిపై ఉప చట్టం కింద తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని, అయితే అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని జర్నలిస్టు నేతలు ఉద్ఘాటించారు. తిరుపతి బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద 'న్యూస్‌క్లిక్'పై దాడులను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్, రైతు, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు ప్రసాద్, జనార్ధన్, వళిగళం గోపి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. వాస్తవాలను రాస్తున్న జర్నలిస్టులను అణచివేయడం, చంపేందుకు వెనుకాడటం లేదని, అందులో భాగంగానే గౌరీలంకేష్‌ను గతంలో హతమార్చారని గుర్తు చేశారు. ఢిల్లీలోరైతులు చేస్తున్న పోరాటానికి సంబంధించి కేంద్రం చేస్తున్న కుట్రను ఎప్పటికప్పుడు ప్రగతిశీల పత్రికలకు అందించిన న్యూస్‌క్లిక్‌ను 2021 నుంచి వేధిస్తూనే ఉందన్నారు. జర్నలిస్టులను ఉగ్రవాదులుగా ముద్ర వేయడం సరికాదన్నారు. నిరసనకు సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నాయకులు పెంచలయ్య, విశ్వనాథ్, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య సంఘీభావం తెలిపారు.జర్నలిస్టు సంఘాల నాయకులు గిరిధర్, ఆదిమూలం శేఖర్, కె.గిరిబాబు, మునిరాజా, నరేంద్రరెడ్డి, నరేంద్ర, రాధాక్రిష్ణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో జర్నలిస్టుల నిరసన

ఖైదీలకు విముక్తి కల్పిస్తాం

న్యాయ సాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కరుణ కుమార్



చిత్తూరు జిల్లా కేంద్రం జైలులో నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

జైల్ లో ఉన్న ఆశ్రమ వాసులు (ఖైదీలు)విముక్తి కి అవకాశాలు ఉంటే వారికి కల్పించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ్ కుమార్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా జైలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ అదాలత్ కార్యక్రమం నందు జిల్లా నాలుగో అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బాబాజాన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మూర్తి లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్‌లో ఉన్న ఆశ్రమ వాసులు (ఖైదీల)విముక్తి కి అవకాశాలు ఉంటే అవకాశాన్ని వారికి కల్పించడం జరుగుతుందన్నారు. ఆవేశంలో చిన్నచిన్న నేరాలు చేసి ముద్దాయిలుగా జైలు జీవితం గడుపుతున్న వారి కేసులు విచారణ జరిగే టప్పటికి చాలా కాలం పడుతుందని, కాబట్టి ఆశ్రమవాసులకు (ఖైదీల) రాజ్యాంగం కల్పించిన హక్కులు అన్నీ హరించబడతాయన్నారు. ఆశ్రమ వాసులను త్వరగా జైల్ నుండి విముక్తి చేయాలన్న విషయాన్ని సుప్రీం కోర్టు ఆలోచించి జైల్ నందు అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమరావ్ సూచనల మేరకు శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, మదనపల్లి, పీలేరు జైళ్లలో జైల్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. 'నేరం చేశారా లేదాని మీ మనసు సాక్షికి తెలుస్తుంది. మీరు ఈ అదాలత్ నందు నేరం ఒప్పుకుంటే మీ కేసుల నుండి విముక్తి చేయడానికి న్యాయమూర్తుల తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది' అని తెలిపారు. మీరు బయటికి వెళ్లి మళ్లీ నేరం చేయకుండా మంచిగా మారి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా అవ్వాలని, జైల్ అదాలత్ మీరు ఉపయోగించుకొని నాలుగోడల నుండి విముక్తి చెంది ఆనందంగా జీవితం గడపాలని సుప్రీంకోర్టు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జడ్జీలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలర్ ఏ.శంకర్ రావ్ పాల్గొన్నారు.

విజ్ఞాన విహారం 'ఇస్రో'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఖగోళగుట్టును రట్టు చేసేందుకు పూనుకుంది భారత శాస్త్రసాంకేతిక రంగం. తాను స్వయంగా రూపొందించిన సాంకేతిక యంత్రాలతో విశ్వ విహారానికి నడుంబిగించింది. భారతదేశ ప్రతిష్టను పెంచుతూ, ప్రపంచాన్ని నివ్వెరపరిచే పరిశోధనలకు శ్రీకారం చుట్టింది భారతీయ విజ్ఞాన బాండాగారం ఇస్రో. ఖగోళంలోని గ్రహాలను చుట్టేస్తూ సూర్యచంద్రుల్లోని రహస్యాలను బహిర్గత పరిచే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. అగ్రదేశాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో, ఓ దశలో వాటికి రెట్టింపు స్థాయిలో దూసుకుపోతోంది ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో). అంతరక్ష వారోత్సవాలు (వరల్డ్ స్పేష్ వీక్-2023) సందర్భంగా దేశ విజ్ఞాన ప్రతిభను వినువీధుల్లో విహరింప చేస్తున్న ఇస్రో గొప్పతనాన్ని భావి బారత పౌరులకు తెలియజేసేందుకు పూనుకుంది ఆ సంస్థ. అందులో భాగంగా ప్రతి విద్యాసంస్థల్లో విద్యార్థులకు వారం రోజుల పాటు ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పిస్తూ, పలు విజ్ఞాన పోటీలు నిర్వహించి, ప్రోత్సాహక బహుతులు అందజేస్తుంది. ఈ సందర్భంగా ఇస్రో గురించి మచ్చుకు కొన్ని మాటలు....

సూర్య చంద్రుల దరిచేరడం ఎవ్వరి తరం కాదు. ఇది ఒకప్పటి మాట. అందానికి మారుపేరు పున్నమి చంద్రుడు. ఆరుబయట వెన్నెల వెలుగులో పడుకుని ఆకాశంలోని పున్నమి చంద్రుని చూస్తే మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తుంది. అంతటి అందాన్ని పసిపిల్లలకు అద్దంలో చూపిస్తూ అమ్మలు ఆహారాన్ని అందించడం భారతీయ పురణకథల్లోన్ని సన్నివేశాలు. కానీ అదే భారతీయులు చందమామపై పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. భారతీయులు విజ్ఞానంలో ఏ మాత్రం తక్కువ కాదని మరోసారి ప్రపంచానికి చాటారు. చంద్రయాన్-3 ని విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచాన్ని అబ్బురపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని శ్రీహరికోట ఇస్రో కేంద్రం ఇందుకు వేదికైంది. జూలై14వ తేది చంద్రయాన్‌ను ఇస్రో నుంచి ప్రయోగించి ఆగస్టు 23వ తేది సురక్షితంగా చందమామాపై ల్యాండ్ చేయడంలో విజయం సాధించింది. దానికి ఒక రోజు ముందే రష్యా ప్రయోగించిన ఇదే ప్రయోగం విఫలమైన చోట భారతీయులు విజయం సాధించడం గమనార్హం. ఆ విజయంతో మరో అడుగు ముందుకేసి అదే నెలలో ఆదిత్య ఎల్1ను ప్రయోగించింది. దీని ద్వారా సూర్యుడిపై జరుగుతున్న మార్పులను కనిపెట్టి, దానికి గల కారణాలు, ఇతరత్రా రహస్యాలను బట్టబయలు చేసేందుకు పూనుకుంది. ఆదిత్య ఎల్1 ఇపుడు ఆకాశంలో పయనిస్తూనే ఉంది. ఇదే ఉత్సాహంతో గగన్‌యాన్ ద్వారా మానవసహిత రాకెట్లు ప్రయోగించి, చందమామపై అడుగు పెట్టేందుకు సిద్దమవుతోంది. ఇలా వరుస విజయాలతో ముందుకెళ్లుతున్న ఇస్రో మరింత మంది భవిష్యత్తు శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఇస్రో విధులు, అందులోని ప్రయోగాలు, వాటి ఫలితాలు, తదితర విషయాలను వివరించి, వారిలో ప్రయోగాలపై ఆసక్తి పెంచేలా చేసి, ఇంజనీర్లుగా మార్చి, శాస్త్రవేత్తలగా తీర్చిదిద్దేలా చేయాలని సంకల్పించింది. అందులో బాగంగా ఈ నెల 4వ తేది నుంచి 10వ తేది వరకు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో స్పేస్ వీక్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేది టిటిడి సహకారంతో తిరుపతి ఎస్‌జిఎస్ పాఠశాలలో ఇస్రో శాస్త్రవేత్తలు పలు ప్రయోగాల నమూనాలు, వాటి సామర్థ్యం, పనితనం వంటి వాటిని ఫోటోలతో వివరించి, వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగంపై మరింత అవగహన కల్పించి, భవిష్యత్తు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాలనే వారి లక్ష్యం నెరవేరాలని ఆశిస్తూ, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అందిద్దాం.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న జనసేన కార్యకర్తలు

జనసేన సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -పలమనేరు : జనసేన జిల్లా అధ్యక్షులు ఆదేశాల మేరకు ఆ పార్టీ పలమనేరు రూరల్ మండలం అధ్యక్షులు మోతుకూ రు నాగరాజు అధ్యక్షతన జనసైనికులతో ఆత్మీయ సమావేశం మరియు మండల కమిటీ రివ్యూ సమావేశం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథి గా జిల్లా కార్యదర్శి పసుపులేటి దిలీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పొత్తులో భాగంగా టిడిపి నాయకులతో ఎలా కలిసి పని చేయాలని, భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించామని నూతన కమిటీ ఏర్పాటు చేయడం, కమిటీలో లేకుండా పార్టీ కోసం పని చేస్తున్న నాయకులను ఈ కమిటీలో గుర్తించామని రూరల్ మండల అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల, పంచాయతీ స్థాయి జనసైనికులు పాల్గొన్నారు.

జగనన్న కంటి వెలుగు చికిత్సలు అందిస్తున్న వైద్యులు

జగనన్న కంటి వెలుగుకు విశేష స్పందన: ఎంపీపీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జగనన్న కంటి వెలుగు కు విశేష స్పందన వస్తోందని ఎంపీపీ అమరావతి అన్నారు. శనివారం మండలంలోని కూర్మాయిపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తుంబుకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు ఆధ్వర్యంలో ఇర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ భారత దేశంలోనే ఆరోగ్య శిబిరాలు ఎక్కడ ప్రారంభించలేదని తన పాదయాత్రలో క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలని ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలో ప్రారంభించారని ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్రాల్లో అవలంబించాల ఆలోచనలు ఉన్నారన్నారు అనంతరం పలువురికి వైద్య పరీక్షలు చేపట్టి తగిన మందులు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు హేమలత, దీప, ఇంచార్జ్ తహశీల్దారు అనిల్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి అంగన్వాడి సూపర్వైజర్ జయ శ్రీ, డాక్టర్లు యుగంధర్, రమేష్, వైద్య, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి సమక్షంలో పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం పత్తికొండ పంచాయతీ పరిధిలో పలువురు వైసిపి నాయకులు మాజీ మంత్రి అమర్నాథరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. శనివారం గడపగడపకు టిడిపి కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి పాల్గొనగా పత్తికొండ గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీపతి, జీ.విశ్వనాథ్, గంగరాజు, మురళి,కృష్ణమూర్తి, బాబు, హరినాథ్, రమేష్,అమర్నాథ్, ఉమాపతి, చిరంజీవి, ప్రకాష్, సంపత్,లోకనాథ్, టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి మాజీమంత్రి పార్టీ కండువాలను వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుడవాహనంపై గోవిందుని దర్శనం

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం : గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్త పల్లి మిట్ట నందు ప్రతి ఏడాది పొరటాశి నెల మూడవ శనివారం వేడుకలలో భాగంగా శనివారం ఆలయ పూజారి అయినా కుమార్ , హేమాద్రి శాస్త్రాహంగా బాల గణపతి హోమం, అభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ డివి డిల్లయ్య కుమారు లు విష్ణు ప్రసాద్ పవన్ కుమార్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఆహ్వానితులు ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయ నందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు . గోవింద నామ స్మరణతో , కేరళ వాయిద్యం నడుమ అంగరంగ వైభవంగా స్వామివారిని ఊరేగించారు . మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో చిత్తూరు డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి మాజీ సర్పంచ్ విజయబాబు, గ్రామస్తులు, యువత, మహిళలు ,పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని పెద్ద ఎత్తున గోవింద నామ స్మరణతో వీధి వీధినా స్వామి వారు పూజలు అందుకున్నారు .

చోరీ సొమ్ము లభ్యం

ప్రజాశక్తి -చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ మహిమతో దొంగలించబడ్డ సొమ్ము లభ్యమయింది. దీంతో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లి మండలం కొత్తవారిపల్లి పంచాయతీ పుల్లకూర వాండ్లపల్లి కి చెందిన దేవేంద్ర ఇంట్లో రెండు లక్షలకు పైగా విలువ చేయు 32 గ్రాముల బంగారం గొలుసు దొంగలించబడింది. దీంతో రాజనాల పండుగ ప్రమాణం చేయాలని అనుమానితులను బాధిత దేవేంద్ర తెలిపాడు. శనివారం ప్రమాణం చేయాల్సి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి బంగారం గొలుసును దేవేంద్ర ఇంటి ముందు పడేశాడు. తమకు బంగారం లభించించినందుకు బాధితులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

మార్కెట్ యార్డ్ కు ఎల్ఇడి లైటింగ్ బోర్డు వితరణ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మార్కెట్ యార్డు వెలుపల ఎల్ఈడి లైటింగ్ తో ప్రత్యేకంగా డిజైన్ చేసిన లిటమాటో మార్కెట్ యార్డు బోర్డును రూరల్ మండలంలోని పరాగ్ మిల్క్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం శనివారం వితరణ చేసి అమర్చారు. ఈ సందర్భంగా ఎల్ఈడి బోర్డును ఏర్పాటు చేసిన డైరీ యాజమాన్యం కు ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ అంజప్ప, సెక్రటరీ సంజీవ్ కుమార్ , మండి సుధ , డైరెక్టర్లు పొటెల్ బాబు , మణి , వేణు గోపాల్ రెడ్డి ,సుబ్రహ్మణ్యం , కౌన్సిలర్ క్యూడియస్ రాజేష్ తో పాటు మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భూములకు హక్కులు కల్పించండి..

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం సుందరాంగిపల్లె కాలనీవాసుల తమకి భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ శనివారం నిరసనకు దిగారు. దేవరగుడిపల్లె రెవెన్యూ లెక్క దాఖలాలో ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు సీజేఎఫ్ఎస్ భూము ఉన్నాయి. గతంలో వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. స్పందనలో కూడా విన్నవించినట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ భూములు ఇలానే సమస్యలతో ఉన్నాయి. తమకు శాశ్వత భూమి హక్కు కల్పించాలని కోరుతూ రైతులు అందరూ ఆ గ్రామ పొలాల్లో కలిసి నిరసనకు దిగారు. న్యాయం చేయాలని కోరారు.

పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు అటవీ శాఖ వారు జాతీయ వన్య ప్రాణి వారోత్సవాలను (అక్టోబరు 2 నుండి 8 వ తేదీ వరకు) పురస్కరించుకుని పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అక్టోబరు 2 న గాంధీ జయంతి నాడు ఒక అవగాహన సదస్సును నిర్వహించి వన్య ప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. దీనికి కొనసాగింపుగా పాలిటెక్నిక్ విద్యార్థినులకు వన్యప్రాణి సంరక్షణ మీద వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించనున్నట్లు, వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 12 మందిని ఎంపిక చేసి వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ పోటీలలో అన్ని విభాగాల నుండి మొత్తం 42 మంది విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం న ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలో బహుమతుల ప్రదానోత్సవం చేశారు. ఈ ఉత్సవం లో ప్రిన్సిపల్ డా. మహమూద్, పలమనేరు ఫారెస్ట్ రేంజి ఆఫీసరు శివన్న, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సురేంద్ర, సుకుమార్, రమేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాధాకృష్ణ, అనిత, తిరుపతయ్య, ప్రేమలత, పాలిటెక్నిక్ అధ్యాపక బృందం పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న అటవీ అధికారులు

రెవెన్యూ అధికారులతో న్యాయమూర్తుల సమావేశం

ప్రజాశక్తి పలమనేరు: సుప్రీం కోర్ట్, రాష్ట్ర హైకోర్టు, చిత్తూరు జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 21 జరగబోవు స్పెషల్ లోక్ అదాలత్ గురించి పలమనేరు ,గంగవరం , బైరెడ్డిపలి, వీ.కోట రెవెన్యూ అధికారులతో న్యాయ మూర్తులు శనివారం సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు లో పెండింగులో ఉన్న రెవెన్యూ కేసులను సామరస్యంగా పరిష్కరించడానికి కక్షిదారులతో సహకరిం చాలని ఆదేశించారు . పలమనేరు సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న నాలుగు మండలాల వారిగా రెవెన్యూ కేసులకు సంబంధించి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కె రవి ,పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె లక్ష్మీపతి , ఏ. జి .పి .మోహన్ రెడ్డి , పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శివయ్య, పలమనేరు, గంగవరం తహశీల్దార్లు బైరెడ్డిపల్లి ఆర్.ఐ సరిత , వీ.కోట సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో సమావేశమైన న్యాయమూర్తులు

జగనన్న ఆరోగ్య సురక్షతోనే నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని చిత్తూరు డిఎంహెచ్వో ప్రభావతి అన్నారు. మండలంలోని వివి పురం గ్రామపంచాయతీ ఆరిమాకు లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జగనన్న ఆరోగ్య సురక్ష ను శనివారం వివిపురం సర్పంచ్ లక్ష్మమ్మ, దామోదర నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురం గ్రామపంచాయతీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 560 పేషెంట్లు హాజరయ్యారు. ఈసీజీ 42 బ్లడ్ టెస్ట్ 416 ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా సిమ్స్ హాస్పిటల్ కి 38 మందిని వైయస్సార్ కంటి అద్దాలు, 45 మందికి వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ, 72 ఆర్తో స్క్రీనింగ్ మెడిసిన్120 మందికి అందించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబం లోని కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నాణ్యమైన వైద్యం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో కృష్ణయ్య , తహశీల్దార్ లోకనాథ పిల్లై , ఎస్ఆర్ పురం వైద్యాధికారి డాక్టర్ పల్లవి , డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి , డాక్టర్ గౌరీ , జనరల్ సర్జన్ లక్ష్మీనారాయణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మహమ్మద్ , గ్రామ సెక్రెటరీ బాలరాజ్, జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి మండల కన్వీనర్ మణి నాయకులు కార్యకర్తలు ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పంపిణీ

ప్రజాశక్తి -చౌడేపల్లి: బాధిత కుటుంబానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైయస్సార్ బీమా ను అందించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గ సముద్రంకు చెందిన సద్దాం (25) కట్టెల కని వెళ్లి మూర్చ వ్యాధి మూలంగా నడిం బావిలో పడి మృతి చెందాడు. పోషకుడు మృతి చెందడంతో అతని కుటుంబం వీధిన పడింది దీంతో స్థానిక వైసిపి నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తిరుపతిలోని తన నివాసంలో వైఎస్ఆర్ బీమా ద్వారా బాధితురాలు చిన్నక్కకు రూ 5 లక్షల చెక్కు అందించారు. జడ్పిటిసి నడింపల్లి దామోదర్ రాజు, సర్పంచ్ సరస్వతి, హరినాథ్ వైసిపి నాయకులు జంగారెడ్డి, కృష్ణమరాజు, ప్రభాకర్ రెడ్డి, అమర్నాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేంకటే గౌడను నిలదీత

జనసేన మండల కార్యదర్శి పై దాడి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేంకటే గౌడకు గడప గడపలో చేదు అనుభవం ఎదురైంది. బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లిలో, సంక్షేమ పథకాల జాబితాలో మంజూరు చేసినట్లు చూపిన ఇంటిస్థలాన్ని చూపాలని జనసేన నాయకుడు మధుసూదన్ నిలదీశారు. ఇష్టానుసారం ఇంటి స్థలాలను అమ్మేసుకున్నారని ఇంటి స్థలం చూపించాల్సిందే అని మధు కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సమాధానం చెప్పలేక ఎమ్మెల్యే వేంకటే గౌడ వెళ్లిపోయారు. అనంతరం మధు కుటుంబ సభ్యులపై పోలీసుల సాక్షిగా వైసీపీ నాయకులు దాడి చేశారు. మధుసూదన్ తలకు బలమైన గాయాలు కావడంతో బైరెడ్డిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆసుపత్రి వద్దకు భారీగా జనసేన కార్యకర్తలు

అనంతరం పరిస్థితి అందోళనకరంగా ఉండడంతో వైద్యులు పలమనేరు ఏరియా ఆసుపత్రికి108 వాహన సహాయంతో తరలించారు. బాధితుడి నుండి పోలీసులు వివరాలు సేకరించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధుసూదన్ ను జనసేన జిల్లా కార్యదర్శి పసుపులేటి దిలీప్, బైరెడ్డిపల్లి మండలాధ్యక్షుడు కిషోర్ గౌడ తదితరులు పరామర్శించారు.

అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం : మాజీ ఎంపీపీ

ప్రజాశక్తి రామచంద్రపురం: రాష్ట్రంలోని అవినీతి అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదామని మాజీ ఎంపీపీ డి బిందు మాధవి పిలుపునిచ్చారు. శనివారం అనుపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని కొవ్వొత్తులు వెలిగించి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం, అప్పులు, అరాచక, కుట్ర పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకుండా అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. రానున్న శాసనసభ ఎన్నికలలో టిడిపి, జనసేనలు ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన నారా చంద్రబాబు నాయుడిని వెంటనే విడుదల చేయాలని టిడిపి నాయకులు ఎన్. మునిరత్నం నాయుడు. బండి విజయ్ కుమార్ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేష్ నాయుడు, బి కోటి రాయల్, వి కృష్ణమూర్తి, కే మోహన్ రెడ్డి, ఎం రాము, ఆకా దేవరాజులు. ఆర్ చెన్నకేశవులు, ఎం వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోట : రానున్న సీజనల్ సమయాలలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న హైస్కూల్ లో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి.హరీష్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు హాజర య్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇలాంటి మహోన్నతమైన పథకం మర్చిపోలేనిదని కొనియాడారు. పంచాయతీ పరిధిలో అనారోగ్యంతో ఉండే ప్రతిఒక్కరికి ఇలాంటి పథకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కొన్ని రోజులు క్రితం వాలంటీర్లచే ఇంటింటికి వెళ్లి అనారోగ్యంతో ఉండే బాధితుల లిస్ట్ ను నమోదు చేసి ప్రస్తుతం అలాంటి వారందరకి సంబంధించిన వైద్యులు చికిత్స, పరీక్షలు నిర్వహించి మందులు అందించారన్నారు. ఆరోగ్యం పట్ల ప్రథమంగా ముందుస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ, విద్యుత్, తదితర వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి. హరీష్ చంద్రా రెడ్డి,సర్పంచ్ బందిల ప్రసన్న, వైసీపీ కోట మండల కన్వీనర్ పల్లగాటి సంపత్ కుమార్ రెడ్డి, కోట బిట్ 2 ఎంపిటిసి షేక్ మొబీన్ బాష, శానంపూడి గోపాల్ రెడ్డి, కట్టాశంకర్ రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్ రెడ్డి,గాలి శ్రీనివాసులు రెడ్డి,హర్ష వర్ధన్ రెడ్డి,ఎమ్ డిఓ భవాని, ఎంఈ ఓ మస్తానయ్య,ఎమ్ పిపి దాసరి, అంజమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు చేవూరి నాగేశ్వరావు, వైద్య, సచివాలయం, అంగన్‌వాడీ, విద్యుత్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాక్సింగ్ ఛాంపియన్ రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేశారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రధానోపాధ్యాయులు మురళి అధ్యక్షతన ప్రారంభోత్సవం జరిగింది. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రా రెడ్డి భోజనం సదుపాయం కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని వివిధ పాఠశాలల నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ విచ్చేసి ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్ ను బహుకరించారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిం చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ అధ్యక్షులు విజయ కుమారి కార్యదర్శి, బాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి -కుప్పం: కుప్పంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయనకు మద్దతుగా వక్కిలిగా కులస్తులు శనివారం నియోజకవర్గంలో పార్టీ కార్యాలయంలో మద్దతు తెలిపారు. చంద్రబాబు త్వరగా విడుదల కావాలని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ దేవతగా వేషధారణ వేసి న్యాయదేవతకు తక్షణమే చంద్రబాబుకు న్యాయం జరగాలని అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, వక్కిలిగా కుల నాయకులు హిమంబర్ గౌడు, ప్రశాంత్ గౌడ్, భాస్కర్ గౌడ్, గోపాల్, బాలచంద్ర, అశోక్, వెంకటాచలం గౌడ్ భారీగా మహిళలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధిని మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు అన్నారు. శనివారం మండల తెలుగుదేశం కార్యాలయం ఆవరణంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు నాయకులు గిరిబాబు ,రాజేంద్రనాయుడు ,రవి, సూరి ,గురుస్వామి, రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపిఇ అధిష్టానం కాంతితో క్రాంతికి కార్యక్రమంతో సంఘీభావం తెలపాలని ఆదేశించింది. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పుల్లూరు క్రాస్‌లో నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు మాజీ టిడిపి జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఇళ్లల్లో వీధులలో లైట్లు ఆపి కొవ్వొత్తులు, కాగడాలు ,టార్చ్ లైట్లతో వినూత్నంగా కాంతితో క్రాంతి కి కార్యక్రమం ద్వారా సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలు యువత టిడిపి నాయకులు కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య నాయుడు, మోహన్ నాయుడు ,మంగుంట చంద్రబాబు రెడ్డి, హేమాద్రి యాదవ్, భూపతిరెడ్డి, చంద్రబాబు నాయుడు దేవరాజులు నాయుడు, నోమేశ్వర్ రెడ్డి , రామిరెడ్డి , మహిళ నాయకులు శారద, కుమారి, చంద్రన్న నయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసిస్తూ శనివారం టిడిపి నాయకులు గురజాల జగన్ మోహన్ బెంగుళూరు నగరంలోని కాడుగుడిలోని తన కార్యాలయం ముందు టిడిపి పార్టీ పిలుపునిచ్చిన కాంతితో క్రాంతి నిరసన కార్యక్రమానికి మద్దతుగా విద్యుత్ దీపాలు ఆర్పివేసి,కొవ్వోతుల వెలుగులతో తమ నిరసన వ్యక్తం చేశారు.

నగరి: సాక్ష్యాలు లేని సిల్లీ కేసులో చంద్రబాబు గారిని ఇరికించడం తగదని నింద్ర మండల టీడీపీ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆర్డిఓ ఆఫీస్ ఎదురుగాచంద్రబాబు రిమాండ్ కు నిరసనగా అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై ఒంటికాలుతో నిలబడి వైసీపీ ప్రభుత్వానికి తమ నిరసన నగరి నియోజకవర్గం నింద్ర మండల టిడిపి నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు (నింద్ర మండలం), జి.రమేష్ బాబు (నగరి టౌన్), మాజీ ఎంపీటీసీ జగన్, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటేశులు నాయుడు, ఆనందరాజు, డి.గంగాధరం నాయుడు, మనోహర్ నాయుడు, ప్రసాద్, రాము, ఆనంద్, రఘు, నెట్టేరి బాబు, సాయరాజ్, ప్రకాష్, కోటి, మహేష్, అగరం రమేష్, రవి, తోజేష్, జగన్నాథం, రఘురాం, దయాలన్, పయణి, శరత్‌పాల్గొన్నారు.

ఇంటింటికి టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: టీటీడీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రానికి మళ్ళీ సీఎం అయితే తద్వారా ప్రజలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌హెచ్ నియాజ్ అలీ అన్నారు. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవల కొండ గ్రామం లో బాబుతో భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను నియోజవర్గ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ హెచ్ నియాజ్‌అలీ తోపాటు ఆవల కొండ టిడిపి నాయకులతో కలిసి శనివారం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.అనంతరం నియాజ్‌అలీ మాట్లాడుతూ ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న జగన్ నియంతల ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ తనపై ఉన్న అక్రమ కేసులకు భయపడే రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రజాక్షేత్రంలో చంద్రబాబు, లోకేష్ లకు వస్తున్న ఆదరణను చూసి అక్రమ అరెస్టులు చేస్తున్నారని, జగన్ విధ్వంసకర పాలన అతి త్వరలోనే ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేతలు ముర్తుజా, అలి అబ్బాస్, జోహార్, హరిప్రసాద్, ఫిరోజ్, సాబేర్, ఇన్ తూ, పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన ఆర్.కె గోపి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్. మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె.గోపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా స్పెషల్‌ఎన్‌ఫోర్సుమెంటు అధికారి రాజేంద్ర

డ్రగ్స్ రహిత సమాజ సాధనే లక్ష్యం

- జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి రాజేంద్ర

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : డ్రగ్స్ రహిత సమాజ సాధన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి రాజేంద్ర సూచించారు. జిల్లా సబ్ అధికారంతో ఆయన శనివారం నేర సమీక్ష నిర్వహించారు. గత నెలలో ఛేదించిన కేసు వివరాలను గురించి తెలుసుకొని, ఆ సమయంలో ఎదురైన సవాళ్ళను, లోటుపాట్లను సరి చేసుకుంటూ, రాబోయే బ్రహ్మోత్సవాలు, దసరా సెలవుల సమయంలో మరింత కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లి తిరుపతి నగరంతో పాటు జిల్లాలో నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాల అవశేషాలు కూడా లేకుండా సమూలంగా అరికట్టేందుకు మనమందరం కంకణం కట్టుకొని, అహర్నిశలు పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఖచ్చితంగా పాటించవలసిన ప్రణాళికను సవివరంగా సెబ్ అధికారులకు వివరించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంటు సూపరింటెండెంట్ గూడూరు రమేష్, తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అధికారులు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో ప్రతిభ చూపిన విద్యార్థినులు

ప్రాంగణ ఎంపికలో మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ అండ్ కెరియర్ కౌన్సెలింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ చైతన్య, భాష్యం విద్యాసంస్థల ప్రాంగణ ఎంపికలలో వర్సిటీ విద్యార్థినులు తమ ప్రతిభను చాటారు. సోషియల్ సైన్సెస్ సైన్సెస్ విభాగాల నుండి మొత్తం 173 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ విభాగం డైరెక్టర్ ఆచార్య ఆర్ ఉష వెల్లడించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలను సాధించిన విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి భారతి, కుల సచివులు ఆచార్య ఎన్ రజిని సోషల్ , సైన్సెస్ డీన్ లు ఆచార్య సుజాతమ్మ, ఆచార్య అనురా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అనంతరం విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో ఉన్నత రంగాల్లో రాణించేందుకు ప్రాంగణ ఎంపికలు మహిళా వర్సిటీలో దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమ రంగంలో ఉన్నతంగా రాణించేందుకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ ప్రాంగణ ఎంపికలో ఎక్కువ మంది విద్యార్థులు వివిధ క్యాంపస్లలో ఎంపిక కావడం హర్షదాయకమని వీసీ ఆచార్య డి. భారతి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అండ్ కెరియర్ సెల్ కౌన్సెలింగ్ సెల్, మెంబర్స్ ప్రొఫెసర్ ఎన్. జాన్ సుష్మ, ప్రొఫెసర్ బి.కిషోరీ, డాక్టర్ ఇందిరా, డాక్టర్ సుజాత, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్లకు దివ్యాంగులు అప్లై చేసుకోవాలి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: ప్రభుత్వం సదరమ్ సర్టిఫికెట్లు పొందేందుకు దివ్యాంగ అభ్యర్థులకు అవకాశం కల్పించిందని ఎంపిడిఓ దేవేందర్ బాబు తెలిపారు. ఇందుకు అక్టోబర్, నవంబరు, డిసెంబర్ నెలలకు స్లాట్లు విడుదలయ్యాయని, గ్రామ సచివాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్టీ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌లు అందిస్తారని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.